# స్వేచ్ఛగా.. సజావుగా..

- మహేశ్వరం నియోజక వర్గంలో పోలింగ్ ప్రశాంతం
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు
- ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు
- మధ్యాహ్నం నుంచి మందకొడిగా సాగిన పోలింగ్
- ఓటు వేయడానికి యువత ఆసక్తి
- పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని తెలుసుకున్న విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి



ఓటు వేసి వస్తున్న దివ్యాంగుడికి నమస్కరిస్తూ.. ఎలా ఉన్నావని అడిగిన మంత్రి సబితాఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, నవంబర్ 30 : మహేశ్వరం నియోజక వర్గం వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం వరకు భారీ క్యూలో జనం ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఆసక్తి చూపారు. ఉదయం 9గంటలకు 5శాతం, 11గంటలకు 12.83 శాతం, 3 గంటలకు 39.47 శాతం పోలింగ్ అయింది. మధ్నాహ్నం నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 90 ఏండ్ల వృద్ధురాలిని తీసుకొచ్చి ఓట్లు వేయించారు.

### పోలింగ్ సరళిని తెలుసుకున్న మంత్రి

మహేశ్వరం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటింగ్ సరళిని అధికారులను అడిగి విద్యా శాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి తెలుసుకున్నారు. ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లతో మంత్రి ఆప్యాయంగా మాట్లాడారు. ఓటర్లు మంత్రితో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు. జిల్లెలగూడ, మీర్‌పేట, బడంగ్‌పేట, బాలాపూర్, జల్‌పల్లి, తుక్కుగూడ, మహేశ్వరం తదితర ప్రాంతాల్లో మంత్రి పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడి పరిస్థితి తెలుసుకున్నారు.

### చాలా థ్రిల్‌గా అనిపించింది



మొదటి సారిగా ఓటు వేశాను. చాలా థ్రిల్‌గా అనిపించింది. పోలింగ్ బూత్‌లోకి పోయిన తర్వాత కొత్తగా అనిపించింది. ఓటు హక్కును వినిగియోగించుకున్నాను. మా ఫ్రెండ్స్‌కు చాలా మందికి ఈ సారి ఓటు వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. అభివృద్ధి చేసే వారికి ఓటు వేయాలనిపించింది. **- భారత రత్న**

### ఓటు వేసేందుకు వేరే రాష్ట్రం నుంచి వచ్చాను



మొదటిసారి ఓటు వేయడానికి అవకాశం వచ్చింది. ఓటు హక్కును వినియోగించుకోవాలని వేరే రాష్ట్రం నుంచి వచ్చాను. ఓటు వేయడం మన కర్తవ్యం. కొత్తగా ఓటు హక్కు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. మంచి చెడులను గ్రహించి ఓటు వేశాను. నేను ఓటు అనుకున్న గుర్తుకు వేసినందుకు తృప్తిగా ఉంది. **- సాయి కీర్తి**



జిల్లెలగూడలో ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న ఓటర్లు



బడంగ్‌పేటలో 90 ఏండ్ల వృద్ధురాలైన తన తల్లిని ఓటు వేయడానికి తీసుకొస్తున్న గుడ్ల శ్రీనివాస్



మీర్‌పేటలో ఓటు వేయడానికి వస్తున్న వృద్ధుడు

## ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ

**ఓటు హక్కును వినియోగించుకున్న కలెక్టర్**



ఓటును సద్వినియోగం చేసుకుని, సిరాను చూపుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, నవంబర్ 30 : జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని సంఘం లక్ష్మి బాయి ఉన్నత పాఠశాలలోని 138 పోలింగ్ కేంద్రంలో గురువారం కలెక్టర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మొరాయించిన 4 ఈవీఎంలను మార్చినట్లు తెలిపారు. జిల్లాలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైనదని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందన్నారు. అనంతరం సంఘం లక్ష్మి బాయి ఉన్నత పాఠశాలతో పాటు, స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికలు)లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బంది నిర్వహిస్తున్న పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, పీడబ్ల్యూడీ, పోస్టల్ బ్యాలెట్ మాడల్ అధికారిణి లలితాకుమారి, వికారాబాద్ ఏఆర్‌వో లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటింగ్ సరళి పరిశీలన

వికారాబాద్ జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగుతున్న పోలింగ్ పరిస్థితులు, ఓటింగ్ సరళిని పరిశీలించడానికి సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి ఎన్నికల ప్రక్రియను సాధారణ ఎన్నికల పరిశీలకులు ఆకాశ్, ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్‌తో కలిసి కలెక్టర్ నారాయణ రెడ్డి పర్యవేక్షించారు.

## పటిష్టంగా పోలీసు బందోబస్తు

**రాచకొండ సీపీ డీఎచ్ చౌహాన్**



ఇబ్రహీంపట్నంలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న రాచకొండ సీపీ డీఎచ్ చౌహాన్

ఇబ్రహీంపట్నం, నవంబర్ 30 : రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో చెదరుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ జరిగిందని రాచకొండ సీపీ డీఎచ్ చౌహాన్ అన్నారు. ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నంలో పోలీసు కవాతు నిర్వహించి.. 147వ పోలింగ్ కేంద్రంలో ఆయన బందోబస్తును పర్యవేక్షించారు. రాచకొండ పోలీసు కమిషనర్‌రేట్ పరిధిలో 3,411పోలింగ్ కేంద్రాలున్నాయని సుమారు 9వేల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొన్నారని అన్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ముందుగానే పోలీసులు అవగాహన కల్పించడంతో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయన్నారు. ఓటర్లు పోలింగ్ స్టేషన్లకు వచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. కొందరు అసాంఘిక శక్తులు అల్లర్లు సృష్టించడానికి యత్నించడంతో స్వల్ప లాఠీచార్జి చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయడంతో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా నివారించామన్నారు. 5గంటల తర్వాత పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వారికి టోకెన్ సిస్టం ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల్లో పర్యవేక్షణతో పాటు జూమ్ మీటింగ్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించామన్నారు. మల్కాజ్‌గిరి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో స్వల్ప ఘర్షణలు మినహా.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగలేదన్నారు.

# భౌతిక దాడులు చేయడం సరికాదు

**వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్**

వికారాబాద్, నవంబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు భౌతిక దాడులు చేయడం సరికాదని వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్ అన్నారు. గురువారం వికారాబాద్ డైట్ కళాశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు భౌతికంగా దాడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ.. బీటీఎస్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నేత సుభాన్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు దుర్భాషలాడుతూ భౌతికంగా దాడి చేశారన్నారు. రెండు మూడు రోజుల క్రితం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేశారని గుర్తు చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా శాంతి యుతంగా పరిష్కరించుకోవాలే తప్పా దాడులకు దిగడం దిగజారుడు తనానికి నిదర్శనమని తెలిపారు. గత 4, 5 సంవత్సరాల నుండి వికారాబాద్‌లో ఎలాంటి గొడవలు లేవని, వికారాబాద్ ప్రాంతం ప్రశాంతంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ వారు ఇప్పుడు ఇంతలా దాడులకు దిగితే.. అధికారంలోకి వస్తే రౌడీల రాజ్యమేలుతుందన్నారు. రౌడీల నుంచి వికారాబాద్ ప్రాంతాన్ని కాపాడుకుందామని ఓటర్లను కోరారు. భౌతిక దాడులు చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కోరారు. వారితో పాటు పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రాజేందర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్